# కవితా కౌముది

శ్రీ ప్లవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
26 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
కవిత విభాగంలో బహుమతి పొందిన కవితలు

## ఇవాళ మాత్రం

రమాకాంత్ రెడ్డి (Melbourne, Australia)

ఇవాళ మాత్రం
ఒక సుందరస్వప్నాన్ని చూస్తూ చూస్తూ
మెల మెల్లగా నిద్రలోకి జారుకున్నాను.
ఇవాళ మాత్రం
అడిగేవాళ్ళు మాటవరసకే కుశలమడిగినా
నేను ఎవరి దగ్గరా దుఃఖాన్ని దాచుకోలేదు

ఇవాళ మాత్రం
కోపాన్ని కోపంగానే
బాధని బాధగానే
ప్రేమని ప్రేమగానే
జీవిత వేదికపై ప్రదర్శించాను

ఇవాళ మాత్రం
ఇంకాసేపు ఉండిపొమ్మని కొమ్మా అడగలేదు
ఇదుగో వెళ్తున్నానని పండుటాకూ చెప్పలేదు
ఇవాళ మాత్రం
ఈ గడియలోనే
ఈ పూటలోనే

ఈ రోజులోనే
ఇప్పుడే ఇక్కడే ఉన్నాను
ఇవాళ మాత్రం
దినదినావలోకనంలో
తీరినవెన్ని తీరనివెన్నని
కోరికల పద్దు విప్పి చూసుకోలేదు

ఇవాళ మాత్రం
ఒక శకటాన్నీ ఒక అశ్వాన్నీ త్యాగం చేసి
ఒక బంటుని కాపాడుకున్నాను

ఇవాళ మాత్రం
నా గాథ పూర్తిగా వినేంతవరకూ
తారకలూ జాబిల్లీ నిద్రపోలేదు

ఇవాళ మాత్రం
పొద్దు పొడుపులో ముల్తానీ
మిట్ట మధ్యాహ్నాన బాగెశ్రీ
మలిసందెవేళ దర్బారీ
నడిరాతిరిలో భీంపలాసీ విన్నాను

ఇవాళ మాత్రం
చీలినదారుల కూడలిలో
మనసు చూపిన దారి ఎంచుకుని
మళ్ళీ వెనుతిరిగి చూడలేదు

ఇవాళ మాత్రం
కలమూ కాగితమూ పక్కనపెట్టి
మల్లెతీగతోనూ మబ్బు తునకతోనూ ఊసులాడాను

ఇవాళ మాత్రం

ఊరంతటి వితండం ముందు
ఉలిపిరికట్టె తర్కం వీడిపోలేదు

ఇవాళ మాత్రం
నా మధుపాత్రలు లెక్కపెట్టకూడదని
మధుబాలతో ఒప్పందం చేసుకున్నాను

ఇవాళ మాత్రం
అనుకోకుండా నువు గుర్తొచ్చినా
ఇవాళ మాత్రం
ఎందుకో గుండె చివుక్కుమనలేదు
ఇవాళ మాత్రం!
ఇవాళ మాత్రం!!

## తొలిపొద్దు సూర్యుళ్ళు

సుధా శేఖర్ (Milwaukee, WI)

నువ్వు అంచనా వేసినట్టు
కార్పొరేట్ రావణుల
కన్నెర్రలకి చెదిరి పోవటానికి
వాళ్లేమీ జటాయువులు కాదు-
నిఖార్సైన ఆంజనేయులు!
శాసన పీఠాల ముందు
సాగిలబడి దండాలు పెట్టటానికి
వాళ్లేమి బానిసలు కాదు-
నాగలి కర్రు తో భూమిని చీల్చిన బలరాములు!!

తూటాలకు చెదిరి పోవడానికి
వాళ్లేమీ చెట్ల మీద పక్షులుకాదు
తుపాకులకు గుండెల్ని ఎదురొడ్డిన సమరయోధులు!!!

పదవీ పరపతిల వైపుకు తల తిప్పటానికి
వాళ్ళేమి పొద్దు తిరుగుడు పువ్వులు కాదు-
లోకానికి పొద్దును నేర్పే సూర్యుళ్లు!!
ఇకనుండి మీరు యంత్రాలతో పనులు చేయించొచ్చని
బహుళ తంత్రాలతో సేద్యం చేయొచ్చని
ఏసీ గదుల్లో కూర్చుని కలలు కనకండి!

వ్యవసాయం అంటే స్విచ్ వేస్తే వెలిగే బల్బ్ కాదు
డబ్బు మాత్రలతోనే పైర్లు పెరగవు
పచ్చ పెన్ను పోటుతో పొలాలు పచ్చబడవు
జీవో లతో భూముల్లో జీవం చేరదు!

నిలదీసినందుకు అరదండాలు వేస్తామని
సమైక్యంగా పోరాడుతున్నందుకు
ప్రొక్లేయినర్లతో పెకిలిస్తామని
పిడికిలి ఎత్తినందుకు మట్టి కింద కప్పేస్తామని
భ్రమ పడకండి!
ఆకాశమై విస్తరిస్తున్న
ధర్మాగ్రహన్ని గమనించండి !
చేపలతో కిలాడి వలలు చెప్పే కబుర్లు
వన్య జీవులపై బోనుల కపట ప్రేమలు
పక్షులపై వేటగాడి బాణం చూపే కైపులు
అనుక్షణం చూస్తూ పెరిగిన భూమి పుత్రులు వాళ్ళు....
చీడలు చేనుల్ని ఆక్రమిస్తుంటే
కరెన్సీనోట్లు చట్టాలు గా రూపాంతరిస్తుంటే
ఊరుకోవటానికి వాళ్ళేమీ ఉడతలు కాదు--
బలమైన సర్పాన్ని తరిమేసి
పుట్ట ను కైవసం చేసుకునే చీమలదండులు!!

నిజమే... నువ్వన్నట్లు

వాళ్ళు నోట్లో నాలుక లేనోళ్లే
కానీ నేల తల్లిని కబ్జా చేస్తే మాత్రం
అగ్ని వర్షాన్ని కురిపించే నార సింహులే!
వాళ్లింకా అనాది కాలపు
ఏకలవ్యులు అనుకోకు
అమాయకంగా నమ్మి బొటనవేలు పోగొట్టుకోవడానికి !
వాళ్ళింకా పురాణ కాలపు
శంబూకులు అనుకోకు
శిరస్సు వంచి బలి కావటానికి!

వాళ్ళు
కళ్ళను చూసి కడుపాకలి గుర్తించే కర్ణులు !
కరచాలనాలను చూసి కుట్రలను పసికట్టే కృష్ణులు!
వాళ్లు తలవంచిన ఫిరంగులు!
నడుం వంచిన విల్లమ్ములు!

మొక్కల్ని సాకి ప్రాణం పోయటం ఎంత తెలుసో
కలుపును పెకిలించి పంటను పెంచటం కూడా అంతే తెలిసిన వాళ్ళు!

ఇప్పటికైనా గుర్తించు--
చేనంటే మట్టి మడి మాత్రమే కాదు -
దేశాన్ని బతికించే ఒడి!
రైతంటే బక్క మనిషి మాత్రమే కాదు-
మడికి మనిషికి సంధానం కూర్చే స్వేద సేతువు!
లోకం ఆకలి తీర్చే అక్షయ హేతువు!!
రైతంటే--
మట్టిలోంచి పంటలు మాత్రమే కాదు
మంటలు సైతం పుట్టించ గల prometheus!

# ప్రశంసా పత్రం

## ఇక్కడంతా క్షామమే - రాజోలు సీతారామ రాజు (Johannesburg, South Africa)

నువ్వు ఉత్త కాగితానివి కాదు

కుశల ప్రశ్నల వారధివి

మానవీయ బంధాల సారధివి.

ఇక్కడంతా క్షేమమంటూ

రెక్కలు కట్టుకొని వాలిపోయే నీకోసం

చూపులన్నీ

వీధిమలుపుకే అతుక్కుపోయేవి.

నిన్ను కళ్ళారా చూసి ఎన్నాళ్ళయిందో

ఆ అక్షరాలను తడిమి చూసి ఎన్నేళ్ళయిందో

ఎదురు చూపులెంత మధురమో

నువ్వు చెప్పేదాక మాకు తెలియలేదు.

పాత జ్ఞాపకాలన్నీ నెమరేసుకొని

మాదగ్గరికి మళ్ళీ వచ్చేద్దామని మాత్రం అనుకోకు

ఇప్పుడిక్కడ నిన్నెవరూ గుర్తుపట్టరు

ఎవరు నువ్వని అడిగితే ఆశ్చర్యపోతావు!

మాకిప్పుడు

ముఖపుస్తకమే

బతుకు పుస్తకమయింది

వాట్సప్ పొద్దున్నే

వద్దన్నా "వేకప్" చెబుతోంది

టెక్నాలజీ సాలెగూడులో

చిక్కిన పురుగులమయ్యాం

ఉత్తరమా..

ఇటువైపు రాకు

ఇక్కడెవరూ క్షేమంగా లేరు

ఇక్కడంతా క్షామమే!!

## వీడ్కోలు — శాంత రాయప్రోలు

మసకబారిన కళ్ళతో కలత బారిన మనసుతో

మానవాళి పలుకుతోంది నీకు వీడ్కోలు

మరలిపో శార్వరి తిరిగిరాకు ఇక మరి.

బడుకు జీవుల బ్రతుకు దినదిన గండమయ్యింది

పడుగు పేకల ఉద్యోగ జీవనపు గమ్యం సడలింది

గుడిలో నిలిచి దేవుడు, బడి విడిచి గురువులు ఒంటరయ్యారు

గోవిందుని అభయం, గతి తప్పని అధ్యయనం కరువయ్యాయి

మరలిపో శార్వరి తిరిగిరాకు ఇక మరి

వయసుడిగిన వాళ్ళు వాలిపోయారువ్వచి వగచి అయినవాళ్ళు అలసిపోయారు

వందేళ్ళు బ్రతకాల్సిన వాళ్ళు రాలిపోయారు

విడువలేక కన్నీరు కార్చి కుమిలిపోయాము

మరలిపో శార్వరి తిరిగిరాకు ఇక మరి

మనసువిప్పి మాటాడిన నేస్తాలు

మనవారంటూ మిగిలిన చుట్టపక్కాలు

మరలిరాని లోకాలకు తరలి పోయినవేళ

చివరిసారి చూడలేని బాధ మిగిల్చావు.

మరలిపో శార్వరి తిరిగిరాకు ఇక మరి

బాలలకు బడి ఒడి దూరం చేసావు

బయటకు అడుగిడే ధైర్యం దోచేసావు

మనసుల మధ్య కనిపించని కంచె కట్టావు

మనసులలో మాయని దిగులు నింపావు

మరలిపో శార్వరి మరలి రాకు ఇక మరి

పెళ్ళి పేరంటాల సందడి దోచావు

పండగ పబ్బాల సంతోషం హరించావు

చావు పుట్టుకలకు స్తబ్దతను అద్దావు

సుఖదుఃఖాలను పంచుకునే వీలులేదన్నావు

మరలిపో శార్వరి తిరిగి రాకు ఇక మరి

భయపడ్డాం, బాధపడ్డాం, విసుక్కున్నాము, విలపించాం

మోహాలకు ముసుగేసాం, ఆరడగుల దూరమన్నాం

అలసిపోయి తల ఒగ్గాము, కలుసుకోవడం మానేసాం

మరలిపో శార్వరి తిరిగిరాకు ఇక మరి

గుణపాఠం నేర్చుకున్నాం, పణంగా పెట్టి కోట్ల ప్రాణాలు

పునరావృతం కానీయమని చేయాలి మనఃప్రమాణాలు

నువ్వు నేను, చెట్టూ పుట్టా, పిట్టా పులుగు, జంతుజాలం

కలిసిమెలిసి బతకాలి సృష్టి నియమాలు పాటించాలి,

మరణ మృదంగ విలయతాండవం ఆగాలి

హృదయస్వాంతన స్వచ్ఛ సమీరాలువీయాలి

మరలిపో శార్వరి మా అడుగు ముందుకే మరి

శ్రీ ప్లవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
26 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
మొట్టమొదటి కవిత విభాగంలో బహుమతి పొందిన కవితలు

## అన్ టైటిల్డ్ - శ్రీనాథ్ వాడపల్లి (New Jersey, USA)

రోజూ
రాత్రి మొదలవ్వగానే
ఒక విచిత్రమైన కల.

ముక్కూ మొహం తెలీని ఓ కొమ్మ
పూల చెట్టు కింద
ప్రేమని తుంచుకొంటూ
నాకూ కొన్ని మొగ్గలు
రహస్యంగా

అయితే ఆమె
ప్రేమిస్తున్నట్టు
అర్థం చేసుకున్నట్టు – కనిపించదు.
అలా అని – ఏమీ తెలీదని కాదు.
పునరుజ్జీవన కాలం వర్జిన్ కళ్ళకు
నా మూసిన కళ్ళలో బొట్టు రహస్యం తెలుసు.

నలుపా
తెలుపా
చామన ఛాయా ?
పేరు కూడా తెలీదు.
ఉంటే అది నాకు నచ్చిన పేరే ఉంటుందని నా నమ్మకం.

గుమ్మం ముందు మట్టిగోలెం లో
చిట్టి పువ్వు పేరైనా
అంబరంలో మినుకు తారకైనా
నీలి సముద్రంలో బిందువైనా కావొచ్చు
ఏదైనా నాకు నచ్చేదే.

అరచేతి చందమామతో
గారాబంగా చేతులు చాపుతాను
బంగారం అంటూ.

హఠాత్తుగా ఓ కీచు గబ్బిలం
గోడకు కొట్టుకొన్న శబ్దం
నన్ను నిద్రలేపుతుంది.

## జ్ఞాపకాల బరువు

రవి మంత్రిప్రగడ

ఇది నిన్ను చాలా రోజులనుండి అడగాల్సింది ఇది...
నీకు అవసరం లేని మన గత జీవితపు గుర్తులు కొన్ని నీ దగ్గర ఉండిపోయాయి.
నీకు జ్ఞాపకం ఉన్నాయో లేవో అని, అన్నిటినీ జాగ్రత్తగా ఆఖరిసారి గుర్తుచేస్తున్నా,
నేను సగం గడిపిన ఈ శరత్ వెన్నెల రాత్రితో కబురు పంపిస్తున్నా,
మిగతా సగాన్ని నువ్వు పూర్తి చేసి నా జ్ఞాపకాలతో పాటు తిరిగి పంపించేస్తావా?

మొదటిసారి నిన్నుచూసినపుడు ఆగిన నా ఊపిరి...
నీ ఆలోచనల్లో మరచిపోయిన కొన్నివేల క్షణాలు...
మెల్లగా నువ్వు నాలో కలిసిపోయి,
మాటల ప్రవాహంలో కొట్టుకుపోతూ మరచిపోయిన ఎన్నో నిద్రలు...
గాలికూడా మనమధ్య రానంత దగ్గరగా మనం కూచున్నపుడు,
నీ అరచేతిలో నేను రాసిన పిచ్చిరాతలు...
అక్కడికి వచ్చిన పిట్టల జంటకి మనం చెప్పిన అబద్ధపు కబుర్లు...
తిరిగి పంపించెయ్.!

చీకట్లో నా చేతిని పొదుముకున్నప్పుడు,
నీ చేతికి అంటిన నా చిరు చెమట...
నిన్ను మొదటిసారి తాకినప్పటి నా స్పర్శ...
నీ పెదవుల మీద మిగిలి ఉన్న నా పెదవుల తడి...
నీ మెడ పుట్టుమచ్చని గాయపరిచిన  నా నఖక్షాతం...
నువ్వు గట్టిగా అదుముకున్నప్పుడు నేను వదిలిన వెచ్చని ఊపిరి...
మనిద్దరమే గడిపిన లెఖ్ఖలేనన్ని వెన్నెల రాత్రులు..
తిరిగి పంపించెయ్..!
వర్షాకాలపు ఒక సాయంత్రం,ఇదే మనం కలవడం ఆఖరు అని,
మన కలయిక ఒక కల అని చెప్పి,
వెనక్కి తిరిగి చూస్తే,
నా కళ్ళలోకి చూస్తే కరిగిపోతానేమో అన్న భయంతో
మన కలల నుండి,మన భవిష్యత్తు నుండి,నా జీవితం నుండి పరుగెత్తావు కదా?
ఆ రోజే,ఆ క్షణమే నీతో పాటే వచ్చేసిన నా బరువైన మనసు అక్కడే,
నీ ఇంటి వాకిట్లో నువ్వు తిరిగి వస్తావేమో అన్న ఆశతో ఎదురుచూస్తోంది.
దానికి ఎలాగో నచ్చజెప్పి తిరిగి పంపిస్తావా?

నిజం కావు అని తెలిసి కూడా మనం కట్టుకున్న ఆశల మేడలు...
నువ్వు తిరిగి రావు అని తెలిసినపుడు పగిలిన నా గుండె...
నన్ను వదిలి నువ్వు వెళ్లి పోయినప్పటి నుండి నేను గడిపిన అమావాస్య రాత్రులు...
నీ దగ్గరే ఎక్కడో నీ జ్ఞాపకాల్లో ఉంటే పంపిస్తావా?

నువు పంపిన ఈ జ్ఞాపకాలు,
రానని మొండికేసే నా మనసు
అన్నిటిని నేను శాశ్వతంగా సమాధి చేసేస్తా,
నాతో పాటే !!!!

# ప్రశంసా పత్రం

## వర్షంలో ఓ సాయంత్రం - లత కందికొండ (ISSAQUAH, WA)

ఉరుముతున్నది మేఘమొక్కటి, సాయంకాలపు సందె చీకటిన,
పరుగు తీసెను చల్లగాలులు, పలకరించెను తొలకరి జల్లులు.
భగ భగ భానుడి సెగలు తగ్గగ, భలె బలే భామలు వగలు పోవగ
వర్షమై కురిసింది ఆకాశం, హర్షమై జంతుజాలం పరవశం.
ప్రేమ పక్షుల ప్రణయనాధ, ఒంటిపిట్టల విరహగీతం,
గాలికెగరగ ఇళ్ళ కప్పులు, బెకబెకలాడెను మడుగు కప్పలు.
కన్నుగీటుతూ కాంతులీనుతూ పరుచుకున్నది ఆకాశం,
పాలపుంతలో ఎన్ని వింతలో, ఎన్ని మెరుపులో మైమరుపులో!
నాట్యమాడగ నెమలి విప్పి తన పింఛం, ఇవ్వవూ నీ అందం నాకు కొంచెం
వాన వెలిసెను గాలి వీచెను విచ్చుకున్నది ఇంద్రధనస్సు.
విల్లు విరిచిన కోదండపాణి విరవగలడా వానవిల్లు?
ప్రకృతి ఎంతో అందమైఅంది సుకృతం ఈ జన్మ మనది.
కవిత పొంగిన కవి హృదయం భావ కవితా బంధురం.
పల్లవి రాయంగా నా కలం పండదా నా కవితాసేద్యం!

## ఉగాదులు ఉషస్సులు - దామరాజు విశాలాక్షి(Canada)

మాకు ఉగాదులూఉన్నాయ్ ఉషస్సులూ ఉన్నాయ్
ఉత్సాహాలు ఉన్నాయ్  ఉద్వేగాలు ఉన్నాయ్
మాత్సర్యాలూ ఉన్నాయ్ మనోగతాలూ ఉన్నాయ్

మానవలోకంలో మనుష్యులకుండాల్సిన మమకారాలన్ని ఉన్నాయ్

మాకు ఉగాదులూ ఉన్నాయ్ ఉషస్సులూ ఉన్నాయ్

అనునిత్యం  అనేక సంఘర్షణల మధ్య

ఆరాట పోరాటాల చక్రంలో తిరుగుతున్నా

అలుపెరుగక పోరాడే అచంచలఆత్మవిశ్వాసాలూ ఉన్నాయ్

ఆత్మగౌరవంతో హాయిగా బ్రతికే అవకాశాలూ ఉన్నాయ్

మాకు ఉగాదులూ ఉన్నాయ్ ఉషస్సులు ఉన్నాయ్....

శిశిరంలో శిథిలమై వసంతంలో విరబూసిన ప్రకృతిలా

చీకాకుల మధ్య శిధిలమై' వేడుకలలో విరబూసే వసంతంలా

వెల్లివిరిసే విలక్షణత ,విజ్ఞత , విచక్షణలూ ఉన్నాయ్

మాకు ఉగాదులూ ఉన్నాయ్ ఉషస్సులు ఉన్నాయి

వెఱ్ఱితలలు వేసే  వికారాల విలయతాండవాలనణచడానికి

వేయికోట్ల మెదళ్ళఆలోచనలతో

విభిన్న మార్గాలలో ఆలోచించే విశిష్ట వ్యక్తిత్వాలు

కూడగట్టుకెదుర్కొనే కౌశల్యాలూఉన్నాయ్

కాలసర్పపు కోరలు విరిచి కాంతినింపి

కఠోర పరిశ్రమ జరిపే దీక్షాదక్షతలూ ఉన్నాయ్.....

మాకు ఉగాదులూ ఉన్నాయ్ ఉషస్సులు ఉన్నాయి.....

సమస్యలతో సతమతమవుతున్నప్పుడుకూడా

సామాజిక  శ్రేయస్సుకు పాటుపడే సంస్కారం

సహృదయత సౌభ్రాతృత్వం ఉన్నాయ్

సమయం వచ్చినప్పుడు సంఘటితశక్తులుగామారి

శత్రు శిరచ్ఛేదనం చేసే శౌర్య సాహసాలున్నాయ్

మాకు ఉగాదులూ ఉన్నాయ్ ఉషస్సులుఉన్నాయ్.

ఉల్లాసభరితంగా ఉత్తేజం సహితంగా

యుగాది నుండి వస్తున్న ఉగాదిని

సాదరంగా స్వాగతించడాలూ ఉన్నాయ్

సంపత్సరమంతా సాధించాల్సిన దానికి

పథకాలు వేసుకొని పాటించే ప్రణాళికలూ ఉన్నాయ్

మాకుఉగాదులూఉన్నాయ్ ఉషస్సులూఉన్నాయ్

గున్న మామిడి గుబురులలోనుండి

కుహు కుహు రాగాలు పలికే కోయిలమ్మల

స్వరాలకు  పులకించి పోతూనే

గూడు ,కూడు ,కోసం గుండెలవిసేలా విలపించే

అభాగ్యుల ఆకలి తీర్చడానికి ఆదుకోడానికి

ఆపన్నహస్తాన్నందించడానికి ఆర్తిని బాపే మార్గాలను

అన్వేషించడంలో అనుభవాలూ ఉన్నాయ్

ఆర్థిక స్థితిగతులను అంచనా వేసుకొని

అడుగులు వేసే  ఆలోచనలూ ఉన్నాయ్ ..

మాకుఉగాదులూఉన్నాయ్ ఉషస్సులూఉన్నాయ్

అరిషడ్వర్గాలను అదుపులో పెట్టుకొని

అహర్నిశలు లోకకళ్యాణం కోసం పాటుపడే

మహనీయులమార్గాలలో నడచి

షడ్రుచులపచ్చడితో సంప్రదాయబద్ధంగా

నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ

గడచిన కాలం నేర్పిన గుణ పాఠాలను

పరిగణన లోనికి తీసుకొని జ్ఞానోదయం కలిగి

సంగీత సాహిత్య సమలంకృతమైన సంప్రదాయఉగాదిని

సందడిగా స్వాగతించడాలూ ఉన్నాయ్.

సకలజనుల శ్రేయస్సును కోరుతూ సంతోషంగా

సంబరాలు చేసుకునే సౌకర్యాలూ ఉన్నాయ్

మాకు ఉగాదులూ ఉన్నాయ్ ఉషస్సులు ఉన్నాయి

పంచాంగశ్రవణాలు పడికట్టు చెప్పే పాండిత్య ప్రకర్షణలు

రాశుల ఫలితాలు రాజపూజితవమానాలు

భవిష్యత్తు కొరకు ఆరాటాలు

భద్రత కొరకు పోరాటాలు అన్నీ ఉన్నాయ్

అనంత విశ్వంలో ఎక్కడున్నా ఆనందోత్సాహాలతో

అన్నిటినీ జరుపుకునే ఆకాంక్షలు ఉన్నాయ్

ఆనందార్ణవాలలో ఓలలాడాలని ఆశలూఆశయాలుఅన్నీ ఉన్నాయ్

మాకు ఉగాదులూ ఉన్నాయ్ ఉషస్సులూ ఉన్నాయ్....

★★★★